ప్రజాశక్తి
మంగళవారం 6 డిసెంబర్ 2022



నేడు ఓటర్ల జాబితా పరిశీలకుల పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల జాబితా పరిశీలకులు ఎ. బాబు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంపై 6వ తేదీన సాయంత్రం 5.30 నుండి 7 గంటల వరకు ఎమ్‌పి, ఎంఎల్‌ఎలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ఇఆర్ఒలతో ముఖా ముఖి చర్చిస్తారు.

నేటి నుంచి సిఎం కప్ జోనల్ క్రికెట్ పోటీలు

సిఎం ప్రైజ్ మనీ కప్ టోర్నమెంట్ భాగంగా మంగళవారం ఉదయం 8గంటల నుంచి జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు జరుగుతాయని చీఫ్ కోచ్ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, పాడేరు, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

తేమ శాతంతో తప్పని కష్టాలు

అప్పులు చేసి ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం విధించిన సవాలక్ష నిబంధనల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలంటే అనేక అవస్థలు పడాల్సిందే.తేమశాతం నిబంధనతో ధాన్యం అమ్మకానికి మెజారిటీ రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల వర్ష సూచనలతో హడావుడిగా కోతలు కోసి, కుప్పలు వేసిన పరిస్థితి నెలకొంది. దీంతో నూర్పిడి అయిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే మూడు రోజులపాటు పూర్తిగా ఆరబెడితేనే 17 శాతం తేమ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అదనపు ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొలాల్లోనే ఉన్న వరిచేను

- వర్ష సూచనతో రైతుల్లో గుబులు
- ఆరబెడితేనే కొనుగోలు
- తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- జామి

జిల్లాలో ఈఏడాది 2.30 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ లో వరిని పండించారు. సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లోనూ ఖరీఫ్ వరి కోతలు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటివరకు గజపతినగరం, చీపురుపల్లి, బాడంగి మండలాల్లో మాత్రమే కొనుగోలు ప్రారంభమైంది. అది కూడా నామమాత్రంగానే. జామి మండలంలో ఇప్పటి వరకు ఒక్క కేంద్రాన్ని కూడా ప్రారంభించలేదు. రైతులు ఆర్‌బికెల చుట్టూ తిరుగుతున్నారు. కొనుగోలు ప్రారంభమైతే ధాన్యం తరలించేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు. మరో తేమ శాతం కోసం రైతులు ఆరబోతకు అదనపు ఖర్చు చేస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ అదనపు ఖర్చులు

ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా అనేక నిబంధనలు వలన రైతులకు అదనపు ఖర్చులు తప్పడం లేదు. వాతావరణం అనుకూల పరిస్థితుల్లో ఎక్కువ మంది రైతులు యంత్రాల ద్వారా వరి కోతలను పూర్తి చేస్తున్నారు. దీంతో తేమశాతం ఎక్కువగా ఉందంటూ చెప్పుకొస్తూ 17 శాతం మించి ఉంటే కొనుగోలు చేయబోమని అధికారులు చెబుతున్నారు. దాంతో పంట కోసినప్పటి నుంచి దాదాపు మూడు రోజులు ఆరబెడితే తప్ప రైతులు ఆశించిన ధర రావడం లేదు. ఒక ఎకరా ధాన్యం ఆరబోతకు రోజులు 5,6 టార్పాలిన్లు వినియోగించాల్సి వస్తుంది. ఒక్కోదానికి రూ.20 అద్దె చెల్లించాలి. ఇలా వారం రోజులకు రూ.1000, అలాగే రోజుకు ఒక్కో కూలీకు రూ.500 నుంచి రూ.700 ఇవ్వాల్సి ఉంది. ఇలా ఎకరాకు ఆరబోత ఖర్చు మొత్తంగా రూ.6వేలు నుంచి 7వేలు అవుతోందని రైతులు వాపోతున్నారు. అదనపు ఖర్చులు భరించలేని కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు అమ్ముకుంటున్నారు.

మరో వారం రోజుల్లో కొనుగోలు ప్రారంభం

మండలంలో 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అంచానాలు వేశాం. మరో వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభమవుతుంది. ఇప్పటికీ నూర్పుడు జరుగుతున్నా, గాలిబోతలు ఇంకా చేపట్టడం లేదు. ఇప్పటికే ఉన్నతాధికారులు కొనుగోలు లక్ష్యాలను నిర్దేశించారు. వాటి ప్రకారం అతి త్వరలో కొనుగోలు ప్రారంభిస్తాం.

కిరణ్ కుమార్, వ్యవసాయాధికారి, జామి

నిబంధనలు సడలించాలి



వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో యంత్రాల ద్వారా కోతలు పూర్తి చేసాం. తేమ శాతం నిబంధన వలన వారం రోజులుగా ధాన్యాన్ని ఆరబెడుతున్నాను. టార్పాలిన్లు, కూలీలకు అదనపు ఖర్చులు తడిసి మోపుడు అవుతున్నాయి. ప్రభుత్వం నిబంధనలు సడలించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. **చలుమూరి వెంకటరావు, జామి.**



డిఇఒ కార్యాలయం ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్టుమెంట్ వద్దని, వెంటనే బదిలీలు చేపట్టాలని, ఉద్యోగోన్నతి పొందిన వారికి తాత్కాలిక స్థానాలు కేటాయించాలని కోరుతూ సోమవారం సాయంత్రం డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈసందర్భంగా యుటిఎఫ్‌జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయిక్, జెవిఅర్ కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము మాట్లాడుతూ వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్‌లో ఐచ్ఛికం ఇచ్చిన ఉపాధ్యాయులకు ఆర్డర్ ఇవ్వాలన్నారు. ఉద్యోగోన్నతులు ఇచ్చిన తర్వాత అవసరమైన స్థానాల్లో వర్క్ అడ్జస్ట్ మెంట్ చేయాలన్నారు. నాడు- నేడు ఫేజ్ 1లో పని చేసిన ఉపాధ్యాయులకు స్పెషల్ లీవ్ ఆర్డర్ ఇవ్వాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పక్ష పాతంగా వ్యవహరిస్తున్న కొత్తవలస, దత్తిరాజేరు ఎంఇఒలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరు అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

విజయనగరం టౌన్ : నగర మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన ఆరు అంశాలకు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ ఎస్ వివి రాజేష్ మాట్లాడుతూ నగర అభివృద్ధే ధ్యేయంగా కౌన్సిల్ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, కమిషనర్ శ్రీరాములు నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, సభ్యులు పట్నాన పైడిరాజు, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మేయర్, కమిషనర్

ఉద్యోగులకు ఎంఐజి లేఅవుట్లు

గరివిడిలో 272 ప్లాట్లు.. దరఖాస్తులకు గడువు నెల రోజులు

ప్రజాశక్తి-విజయనగరం


అన్ని సౌకర్యాలతో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ కింద ఎంఐజి లే అవుట్లను విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ సూర్య కుమారి తెలిపారు. చీపురుపల్లి నియోజక వర్గం గరివిడి లో రైల్వే లైన్ కు దగ్గరగా 272 ప్లాట్లు 150, 200, 240 చదరపు గజాల విస్తీర్ణం లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 5 నుంచి నెలరోజుల పాటు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని, http://migapdtcp.ap.gov.in వెబ్‌సైటు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అందుకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం కలెక్టర్ స్పందన లో విఎంఆర్‌డిఎ అధికారులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని మౌలిక వసతులతో కూడిన లే ఔట్లను ప్రభుత్వ ఉద్యోగుల కోట కింద కేటాయించిన వారికి 20 శాతం రాయితీ , ఆఖరి రెండు విడతల్లో ఒకసారి 10 శాతం చొప్పున అందిస్తామని, పింఛనుదారులకు కూడా ప్రత్యేక రిబేట్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, కెఆర్‌సి ఉప కలెక్టర్ సూర్యనారాయణ, విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, చీఫ్ అర్బన్ ప్లానర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆదర్శ పురుషుడు

రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచంలోనే అత్యుత్తమైన ప్రజా స్వామ్యమైన అతి పెద్ద రాజ్యాంగాన్ని రాసి ప్రపంచ దేశాల రాజ్యాంగాలకు ఆదర్శ పురుషుడిగా అంబేద్కర్ నిలిచాడని రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారుడు జూపూడి ప్రబాకరరావు అన్నారు సోమవారం మాలమహానాడు ఆధ్వర్యాన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లోగీశ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ప్రభాకరరావు మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన వర్గాలు, కులాల వారికి మిగతా వర్గాలతో సమానంగా హక్కులు, అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు. ప్రస్తుతం జగనన్న కూడా ఎస్‌సిల సంక్షేమం కోసం అంబేద్కర్ ఆశయ సాధన కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా నాయకులు చీడి రామకృష్ణ, కోట పైడితల్లి, కోరాడ నారాయణరావు, మైలిపల్లి ముత్యాలు, కెవిఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రభాకరరావు

రీ సర్వేతో సత్ఫలితాలు

గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలి : కలెక్టర్ సూర్య కుమారి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా అధికారులు, సర్వే, రెవెన్యూ సిబ్బంది సమష్టి కృషితో జిల్లాలో చేపట్టిన సమగ్ర భూ సర్వేలో ఉత్తమ ఫలితాలు సాధించగలిగామని కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. సుమారు 180 గ్రామాల్లో పూర్తి చేసిన సర్వే వల్ల 11 వేల మంది రైతుల వివరాలను వెబ్‌ల్యాండ్ లో పొందుపరచగలిగామని గుర్తు చేశారు. రీ-సర్వే ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, డ్రోన్ల వినియోగం, సాంకేతిక అంశాలపై జిల్లాలోని సర్వేయర్లు, పలువురు విఆర్‌ఒలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం శిక్షణ ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వందేళ్ల సమస్యల పరిష్కారానికి రీ-సర్వే ఒక చక్కని వేదిక అని అభిప్రాయపడ్డారు. రీ-సర్వే నిర్వహించే ముందు ఆయా గ్రామాల రైతులందరికీ ముందుస్తు సమాచారం తెలియ జేయాలని సిబ్బందిని ఆదేశించారు. సర్వే, రెవెన్యూ సిబ్బంది ఓపిక, సహనం పాటించాలని ఘర్షణ వాతావరణం లేకుండా ప్రజలను ఒప్పించి ప్రక్రియను ముగించాలని చెప్పారు. జి కార్యక్రమంలో కెఆర్‌ఆర్‌సి విభాగం ప్రత్యేక ఉప కలెక్టర్ సూర్యనారాయణ, చీపురుపల్లి ఆర్‌డిఒ అప్పారావు, సర్వే విభాగం సహాయ సంచాలకులు త్రివిక్రమరావు పలు అంశాలపై సర్వేయర్లకు, విఆర్‌ఒలకు ఇతర సిబ్బందికి అవగాహన కల్పించారు.

స్పందనకు 141 వినతులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు ప్రజల నుంచి 141 వినతులు అందాయి. వీటిలో వైద్య శాఖకు 26, డిఆర్‌డిఎకు 3, హౌసింగ్‌కు 7, మున్సిపల్ శాఖకు 1, ఇతర శాఖలకు సంబంధించి 22 అందగా, అత్యధికంగా రెవిన్యూ కు సంబంధించి 82 వినతులు అందాయి. వినతులను కలెక్టరు ఎ. సూర్య కుమారి, జె.సి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతి రావు, ఉప కలెక్టర్లు సుదర్శన దొర, సూర్యనారాయణ, పద్మావతి స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రీ ఓపెన్ అయిన దరఖాస్తులు అందిన రోజే విచారణా అధికారికి పంపాలని సూచించారు. వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అర్ధవంతమైన సమాధానాలను ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. రీ ఓపెన్ అయిన దరఖాస్తులకు సంబంధించి దరఖాస్తుదారులతో మాట్లాడిన తర్వాతనే డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. ఫోటోలను తప్పకుండా అప్ లోడ్ చేయాలన్నారు. నిర్దేశిత గడువులోగా రీ ఓపెన్ దరఖాస్తులను పరిష్కరించక పోతే తర్వాత డిస్పోజ్ చేయడానికి కుదరదని తెలిపారు.

ప్రభుత్వ శాఖలన్నింటిలో ఖాళీగా నున్న బ్యాక్ లాగ్ పోస్ట్ ల వివరాలను వెంటనే డిఆర్ఒ కు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా శాఖ లో ఖాళీలు లేకపోయినా లేవనే సర్టిఫికేట్ ను అందజేయాలని, ప్రతి శాఖ అధికారి వెంటనే ఈ విషయం లో చర్యలు తీసుకోవాలని సూచించారు.

గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలి

జగనన్న కాలనీలలో ఈ నెల 21 న జరిగే గృహ ప్రవేశాలకు మండల ప్రత్యేకాధికారులంతా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. అధికారులు ఎలాంటి సెలవులు పెట్టరాదని, ఈ లోపల ఎప్పటికప్పుడు పురోగతిపై వివరాలను తనిఖీ చేయాలని, రోజు వారీ ప్రగతి పై నివేదికలను పంపాలని అన్నారు. ప్రతి శనివారం జరుపుకుంటున్న హౌసింగ్ డే ను రెండో శనివారం సెలవు కావడం వలన శుక్రవారమే జరుపుకోవాలని తెలిపారు. కొత్తగా వివాహం జరిగిన జంటలతో ప్రతి మండల కేంద్రం లో సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వివాహానంతరం పిల్లల్ని కనడం, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆరోగ్య సమస్యలు, సమతుల ఆహారం, హెచ్.బి, కుటుంబ నియంత్రణ తదితర అంశాల పై అవగాహన కలిగించాలని తెలిపారు. ఆరోగ్యపరమైన అపోహలను తొలగించాలని, అన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

ఓటు విలువను తెలుసుకొని, ప్రతీఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. విజయనగరం నియోజకవర్గంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ, కలెక్టరేట్ నుంచి కోట జంక్షన్ వరకు సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత ఉన్న ప్రతీఒక్కరూ ఓటుహక్కును పొందాలని కోరారు. ఈనెల 8వ తేదీ వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకొనేందుకు, ఓటును బదిలీ చేసుకోవడానికి, పోలింగ్ స్టేషన్ మార్పునకు అవకాశం ఉందని చెప్పారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ సమయానికి ఓటుహక్కు పొందేందుకు వీలుగా 17 ఏళ్లకే తమ పేరును నమోదు చేసుకొనే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని చెప్పారు. డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఇఆర్ఒ సూర్యనారాయణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్, తహశీల్దార్ బంగార్రాజు, డిప్యూటీ తహశీల్దార్ కోటేశ్వర్రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మహేష్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ పై కలెక్టర్ ఆగ్రహం

బొండపల్లి : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని బూత్ స్థాయి అధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. బొండపల్లి మండలకేంద్రం లోని 1,2 సచివాలయాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను, ఓటర్ల నమోదును పరిశీలించారు. ఎమ్మెల్సీ ఓట్లకు దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. బిఎల్‌ఒలతో మాట్లాడి, ఓటర్ల నమోదు, ఇతర అంశాలపై ఆరా తీశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. డ్రాపౌట్స్ ఎక్కువగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఓపెన్ స్కూలు ద్వారా నైనా వారి విద్యాభ్యాసాన్ని కొనసాగేలా చూడాలని, కనీసం డిగ్రీ వరకు చదువుకొనేలా చైతన్య పరచాలని సూచించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ మిశ్రా, ఎంపిడిఒ వేదవతి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, సాగు రైతులు

సాగు భూములకు పట్టాలివ్వాలి

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

బాడంగి మండలం కోడూరు రెవెన్యూలో దళితులు, బిసిలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సాగు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కోడూరు రెవెన్యూలో సర్వే నెంబర్ 516లో 118 దళిత కుటుంబాలు, మరికొన్ని బిసి కుటుంబాలు 20ఏళ్ల నుంచి ప్రభుత్వ భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ భూమి సాగుచేసుకుని జీవనం సాగిస్తే పట్టాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పట్టాలివ్వాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం ఆర్‌డిఒ పి.శేషశైలజకు వినతిపత్రం అందజేశారు. సాగు భూములపై దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, బి.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి తీసుకున్న చర్యల ఫలితంగా వ్యవసాయం పట్ల మక్కువ పెరిగిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వ్యవసాయానికి, రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తోందని చెప్పారు. విజయనగరం మండలం గుంకలాం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ధాన్యం ఇచ్చిన పదిమంది రైతులకు నగదు బదిలీ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కోలగట్ల మాట్లాడుతూ, రైతు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. ధాన్యం కొనుగోలు జరిగిన 21 రోజుల్లోపే రైతు ఖాతాల్లోకి డబ్బు జమ చేస్తారని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మీనాకుమారి, ఎఎంసి ఛైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, జొన్నవలస పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాధ్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కె.నాగరాజు, ఎఒ ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎడిఎ నాగభూషణరావు, తాహశీల్దార్ బంగార్రాజు, ఎంపిడిఒ జి.వెంకటరావు, హౌసింగ్ ఎఇ జి.వర్మరాజు, ఎపిఎం అరుణ, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

నూతన రహదారి ప్రారంభం

విజయనగరం టౌన్ : నగరంలోని 29వ డివిజన్ రామకృష్ణా నగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన రహదారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మేయర్ వి.విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి శరవేగంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, అచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

37వ డివిజన్‌లో కోలగట్ల పర్యటన

నగరంలోని 37వ డివిజన్‌లో సోమవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ, డిప్యూటీ మేయర్ రేవతిదేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

బిసిలకు వైసిపి చేసిందేమీ లేదు

నిరసనలో టిడిపి నాయకులు అశోక్‌గజపతిరాజు, నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

బిసిలకు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం చేసిందేమీ లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు, విజయనగరం జిల్లా పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం కోట వద్ద 'ఇదేమి కర్మ' కార్యక్రమంలో భాగంగా బిసిలకు జరుగుతున్న అన్యాయాలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలో బిసిల శాతం అధికంగా ఉన్నా చంద్రబాబు నాయుడు తీసుకువచ్చిన ఆదరణ పథకాన్ని తుంగలో తొక్కి ఆదరణ లేకుండా చేశారని అన్నారు. బిసిల సంక్షేమానికి కేటాయించిన రూ.37వేల కోట్ల నిధులు దారి మళ్లించారని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన కొనసాగింది. కార్యక్రమంలో కంది మురళి నాయుడు ప్రసాదు లక్ష్మీ వరప్రసాద్, కర్రోతు నర్సింగరావు, కర్రోతు బంగార్రాజు, కనకల మురళీమోహన్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో పరిస్థితి అధ్వానం

రాష్ట్ర పరిస్థితి అధ్వానంగా ఉందని కిమిడి నాగార్జున అన్నారు. అశోక్‌బంగ్లాలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలంతా వైసిపి పాలనపై మాకు ఇదేమి ఖర్మరా అంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల విధులు నుండి ఉపాధ్యాయులను తప్పించడం చూస్తుంటే ఉద్యోగులకు జగన్ ఎంత భయపడుతున్నారో అర్థమవుతుందన్నారు. బొత్స సత్యనారాయణ టాపిక్ డైవర్షన్‌లో ప్రావీణ్యత పొందారన్నారు. ఉన్నత విద్యను (పిజి)అభ్యసించే ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ లేకుండా చేసి, బిసి గర్జన చేయటం దారుణమన్నారు. సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



టిడిపి నాయకుల నిరసనలో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ

గంట్యాడ : మండలంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులు సోమవారం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ క్రాంతి పథకం ఆధ్వర్యంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా జాతీయస్థాయి ప్రచారంలో భాగంగా ఈ ర్యాలీను చేపట్టారు. ఈ సందర్భంగా ఎపిఎం శ్రీనివాసరావు బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ర్యాలీలో విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.వి.ఎన్ జగన్నాథం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వీర రమణమూర్తి, ఎపిఎం శైలేష్, కళాశాల, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో లింగ వివక్ష, బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల వైఎస్సార్ క్రాంతి పథం, డిఆర్డిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ యు.ఉషారాణి, ఎపిఎం రొంగలి శ్రీనివాసరావులు బాల్యవివాహాలు వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, డిఆర్పి సిబ్బంది, వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.

పాటూరు ఆర్‌బికె పరిశీలన

వేపాడ : మండలంలోని పాటూరు రైతు భరోసా కేంద్రాన్ని ఎంపిడిఒ బిఎస్ఎన్‌కె పట్నాయక్ సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆర్‌బికెలో పనిచేస్తున్న సిబ్బంది ఇంతవరకు చేపట్టిన ధాన్యం సేకరణ వివరాలను సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రైతు పండించిన ధాన్యాన్ని తప్పనిసరిగా తీసుకోవలసిన బాధ్యత సిబ్బందిపైనే ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గంగు నాయుడు పాల్గొన్నారు.

మద్దతు ధరపై చట్టం చేయాలి

విశాఖపట్నం : మద్దతు ధరపై చట్టం చేయాలని కోరుతూ విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ ద్వారా రాష్ట్రపతికి రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు వినతి పంపించారు. సోమవారం ఎంపి ఎంవివి సత్యనారాయణ కార్యాలయ సిబ్బందికి వినతిని అందజేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరపై చట్టం చేయాలని, ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, విద్యుత్ సంస్కరణల చట్ట సవరణ ఆపాలని, ఢిల్లీ రైతు పోరాట కాలంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం విజయనగరం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, అనకాపల్లి జిల్లా రైతు సంఘం కోశాధికారి గంటి నాయన బాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం

వేపాడ : స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు, కార్యాలయ సిబ్బందికి వైఎస్ఆర్ క్రాంతిపథం కార్యాలయంలో సోమవారం ఎంపిపి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు మస్టర్లు వేసే వేతనాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఏపి ఎంపిపి అడపా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆతవలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి'

వేపాడ : మండలంలోని ఆతవ గ్రామంలో మంగళవారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. ఆయన సోమవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరవుతారని నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.

రైతు భరోసా కేంద్రాల్లోనే అమ్మాలి

గంట్యాడ : ప్రతి రైతు పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వానికి అమ్ముకోవాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. సోమవారం రామవరం రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. జెడ్పిటిసి మల్రి నరసింహమూర్తి మాట్లాడుతూ రైతులకు అన్ని సేవలను ప్రభుత్వం ఆర్‌బికె కేంద్రాల ద్వారా అందిస్తున్నదన్నారు. ఎస్ సెల్ జిల్లా చైర్మన్ జైహింద్ కుమార్ మాట్లాడుతూ ధాన్యాన్ని బాగా ఎండబెట్టి తేమ శాతాన్ని చూసుకొని ప్రభుత్వానికి అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విమల్, డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణ కుమార్, మండల వ్యవసాయ అధికారి పి శ్యామ్ కుమార్, సిఎస్‌డిటి ఇందిరా, మండలి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో హనుమద్ వ్రతం

నెల్లిమర్ల : రామతీర్థం రామస్వామి దేవస్థానంలో సోమవారం హనుమద్ వ్రతం జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానంలో అర్చకులు ప్రత్యేకార్చనలు, బాలభోగం నిర్వహించి ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష అర్చన నిర్వహించారు. యాగశాలలో సుందరకాండ హవనం, ఆదిత్య హృదయం, సుదర్శన కవచం, సుదర్శన అష్టకం, ధన్వంతరి మూలమంత్ర హవనం వైదిక సిబ్బంది నిర్వహించారు. ఆస్థాన మండపంలో రామచంద్ర స్వామికి పరోక్ష సేవలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి పేరిట నిత్యకళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపి గూండాలను కఠినంగా శిక్షించాలి


నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

గజపతినగరం : త్రిపురలో సిపిఎం కార్యకర్తలు, నాయకులు, అభిమానులపై అతి కిరాతకంగా పట్టపగలే దాడి చేసి సిపిఎం పార్టీ నేత షాహిద్ మియాను హత్య చేసిన బిజెపి గూండాలను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి. పైడపునాయుడు, డి రాము, టి రాము, శ్రీను, సూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపకరణాల గుర్తింపు శిబిరం


నెల్లిమర్ల : దివ్యాంగ పిల్లలకు క్లస్టర్ పరిధిలో ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ అంబళ్ళ కృష్ణారావు సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సమగ్ర సర్వ శిక్ష ఆధ్వర్యంలో నెల్లిమర్ల భవిత క్లస్టర్ పరిధిలో నెల్లిమర్ల, గుర్ల, విజయనగరం, దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల గుర్తింపు శిబిరం 6న స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో జరుగుతుందన్నారు. అర్హులైన వారు ఫోటో, ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ ఆదాయ ధృవ పత్రం తీసుకొని రావాలని కోరారు. చెవి మిషన్, ట్రై సైకిల్, చేతి కర్ర, వంటి పరికరాలకు ఎంపిక చేసి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని ఆయన తెలిపారు.

బైరిపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్

మెరక ముడిదాం : మండలంలోని బైరిపురంలో గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఏ. అజయ్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో మంచంపై వున్న రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ శిబిరంలో 80 మందికి తనిఖీలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి. గాయత్రి, సచివాలయ ఎఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

గోనె సంచులు అందజేత

'ప్రజాశక్తి' కథనానికి స్పందన


రైతుకు గోనె సంచులను అందిస్తున్న ఉద్యోగి

మెరక ముడిదాం : మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు ఆర్‌బికె సిబ్బంది ధాన్యం కొనుగోలు నిమిత్తం గోనె సంచులను అందజేశారు. సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో 'కళ్ళాల్లో ధాన్యం – రైతు కళ్లల్లో దైన్యం' అనే కథనానికి స్పందించిన అధికారులు ఆగమేఘాల పై గోనె సంచులను పంపిణీ చేశారు. రైతులకు గోనె సంచులు అవసరమైతే కావాలంటే వాళ్ళ వద్ద నుండి ధాన్యం సేకరణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

వైసిపి పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం

ప్రజాశక్తి- భోగాపురం

వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ అన్యాయమే జరుగుతుందని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగారురాజు అన్నారు. సోమవారం కవులువాడ గ్రామంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలూ పూర్తిగా నిర్వీర్యమవుతున్నాయని, రాష్ట్రం తిరోగమనలోకి వెళ్తుందని అన్నారు. ఇంటింటికి వెళ్లి వైసిపి పాలన ప్రజా వ్యతిరేక విధానాల తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి దాసర అప్పలస్వామి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సిరపు శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షులు సరగడ తోగులరెడ్డి, నాయకులు పిడుగు తోటారావు, కోరాడ తాతారావు, రేసు రమణ తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: రాష్ట్ర జనాభాలో 52 శాతానికి పైబడి ఉన్న బీసీ సామాజిక వర్గాన్ని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అణిచివేస్తుందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విమర్శించారు. టిడిపి శ్రేణులతో కలిసి సోమవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో హెచ్‌డిటి రాజేష్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. తొలిత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ 8 వేల ఎకరాల బీసీల అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కేవిబి రాంప్రసాద్, మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి, మల్ల రామకృష్ణ, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌డిటి రాజేష్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి


భోగాపురం: నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

బీసీలకు న్యాయం చేయాలని వినతి

మెంటాడ : రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం టిడిపి ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చలుమూరి వెంకటరావు మాట్లాడుతూ ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బీసీలకు న్యాయం చేయాలని వినతినిచ్చామన్నారు. ఈ ప్రభుత్వం ఓసిలను తప్ప బీసీలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీసీలకు ఉన్న పథకాలన్నీ రద్దు చేశారని కార్పొరేషన్‌లు పెట్టినా కూర్చోవడానికి కుర్చీ కూడా ఏర్పాటు చేయలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గెద్ద అన్నవరం, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి రాజగోపాల్, మండల బీసీ సెల్ అధ్యక్షులు పల్లి సింహాద్రి, అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి గొర్లె ముసలి నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి సిరిపొరపు గురునాయుడు, రెడ్డి సత్యనారాయణ, గుమ్మిడి సింహాచలం, గెద్ద కాశీ, కొరిపల్లి చిన్నంనాయుడు, పాల్గొన్నారు.

గంట్యాడ: రాష్ట్రంలో బిసిలకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని మండల టిడిపి అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇదేం కర్మ బిసిలకు అంటూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరుకే కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నిధులను కేటాయించకుండా వెక్కిరిస్తున్నారని చెప్పారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొరుపోలు రమేష్ కుమార్, నియోజకవర్గ యువత అధ్యక్షులు పెద్ది రెడ్ల సతీష్, మండల ప్రధాన కార్యదర్శి రండి రామునాయుడు, పార్టీ సీనియర్ నాయకులు రొంగలి కృష్ణ, రావాడ రామచంద్ర రావు, గూడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : బిసిలను జగన్ రెడ్డి ప్రభుత్వం అణచివేయడమే లక్ష్యంగా పని చేస్తోందని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి రాము అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్ల కాలంలో రూ.34 వేల కోట్లు బీసీల సబ్ ప్లాన్ నిధులు పక్క దారి పట్టాయన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ నాయకులు కోళ్ల శ్రీను, రాష్ట్ర అయ్యారక బీసీ సెల్ అధ్యక్షులు బంగారు రమేష్, విశాఖ టిడిపి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు తిక్కాన చినదేముడు, పొలమరశెట్టి జగ్గారావు, నక్కరాజు చినరాము, విరోతు శివాజీ, కనకాల శివ, లాలం అర్జునరావు, కొరుపోలు అప్పారావు, పొలమరశెట్టి చిన్నప్ప, జామి సూరిబాబు, పప్పు అప్పలరాజు, బోని తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల : రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు ఆధ్వర్యంలో తహశీల్దార్‌కి వినతి పత్రం అందచేశారు. కార్పొరేషన్‌లు ఫుల్ – నిధులు నిల్, ఇదేం ఖర్మ బీసీలకు అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. అంతరం తహసీల్దార్ పద్మావతి కి వినతిపత్రాన్ని అందచేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు వెన్నె సన్యాసినాయుడు, మండల ఉపాధ్యక్షులు కిలారి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పిల్లా అప్పలనాయుడు, చీపురుపల్లి నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు, జిల్లా బిసి సెల్ కార్యదర్శి శివప్రసాద్, పున్నపురెడ్డి శ్రీను, కమ్మిండి శ్రీరాములు, కర్రోతు గోవింద వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బొండపల్లి: బిసిలకు న్యాయం చేయాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోరాడ కృష్ణ కోరారు. సోమవారం మండల సముదాయం వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి, డిప్యూటీ తహశీల్దార్ శివకుమార్‌కు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిలను ఈ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాపాక అచ్చంనాయుడు, వేమలి చైతన్యబాబు, బూర్లె ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : ఇదేం కర్మ మనరాష్ట్రానికి' వాల్ పోస్టర్‌ను బొబ్బిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు (బేబినాయన) ఆవిష్కరించారు. అనంతరం నాయకులతో కలసి ఇంటి ఇంటికి వెళ్లి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. నాయకులు చింతల.రామకృష్ణ, ఉపాధ్యక్షులు మడక.తిరుపతి నాయుడు మండలపార్టీ అధ్యక్షులు కె. విజయ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మధ్యాహ్న భోజన కార్మికులతో రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మండల విద్యా వనరుల కేంద్రం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు గుర్చి యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలో ఎండిఎం వర్కర్స్‌తో ధర్నా చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతినెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20 పెంచాలని, సామాజిక భద్రతా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జె. సన్యాసమ్మ, ఎ.భవాని, పి.అన్నపూర్ణ, జి. అచ్చియమ్మ, ఎం. ఈశ్వరమ్మ, వీ. త్రినాధమ్మ, జే. ఈశ్వరమ్మ, ఎస్. అర్జునమ్మ, పి. కృష్ణమ్మ, జి ఎరుకులమ్మ, ఎల్ కాళీ, సి హెచ్ ఎర్రయ్యమ్మ, కె ముత్యాలమ్మ, జీ పార్వతి, బి లక్ష్మి, జి లక్ష్మి పాల్గొన్నారు.

డెంకాడ: మధ్యాహ్న భోజన పథకం కార్మికులను గుర్తించి వారికి కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. సోమవారం ఎంపిడిఒ డి.డి స్వరూపారాణికి వినతి పత్రాన్నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి మధ్యాహ్న భోజన పతకం కార్మకుల యూనియన్ నాయకులు పి. ఈశ్వరమ్మ, ఎ. పద్మా, ఎం. కృష్ణవేణి పాల్గొన్నారు.


శృంగవరపుకోట : వినతి పత్రాన్నిస్తున్న సిఐటియు నాయకులు

వంగర: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకంలో జగనన్న గోరుముద్దకు మెనూ చార్జీలు పెంపుదల చేసి, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అసోసియేషన్ రాజాం మండల కార్యదర్శి బి. హైమావతి ఆధ్వర్యంలో సోమవారం ఎంఇఒ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ పథకంలో 88 వేల మంది వంట కార్మికులు పనిచేస్తున్నారని వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటి వంటి సౌకర్యాలు కల్పించకుండా అనేక సంవత్సరాలుగా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హైమవతి, రాములమ్మ, సీతమ్మ, పార్వతి, పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : మధ్యాన్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు సురేష్ మాట్లాడుతూ మధ్యాన్న భోజన నిర్వాహకులను కార్మికులుగా గుర్తించాలనే డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచక పోగా తగ్గిస్తుందన్నారు. అనంతరం హెచ్.డి.టి గౌరిసంకరావుకు వినతినిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ (సిఐటియు) నాయకులు ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ మంచి లక్ష్యాలతో ప్రారంభించిన ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ లక్ష్యానికి విరుద్ధంగా నీరుగారుస్తున్నాయని అన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చెయ్యాలని డిమాండ్ చేశారు. రామలక్ష్మి, అప్పలనర్సమ్మ, రమణ, టి.లక్ష్మి, అప్పయమ్మ, సత్యవతి, తపాల్గొన్నారు.



ఉత్సవాల్లో నృత్యం చేస్తున్న బాలిక

కళా ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో జిల్లా స్థాయి కళా ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతి నాయుడు ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే కళా ఉత్సవాలలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 44 పాఠశాల, కళాశాలల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొని పలు పలు అంశాల్లో పోటీ పడతారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పల్, ఉత్సవాల కో కన్వీనర్ కె. రామకృష్ణారావు, కో ఆర్డనేటర్లు పి. రవి కుమార్, కె. సూర్యా రావు, స్టాఫ్ సెక్రటరీ డి. ఈశ్వర రావు, సూపరింటెండెంట్ కమల కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- గజపతినగరం

గ్రీన్ అంబాసిడర్ల బకాయి జీతాలు చెల్లించాలని, ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో గజపతినగరం ఎంపిడిఒ ఆఫీసు వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వి. లక్ష్మీ మాట్లాడుతూ 9 నెలల నుండి 15 నెలల వరకు బకాయి జీతాలు ఇవ్వకపోతే కుటుంబ పోషణ ఎలా అని ప్రశ్నించారు. ఒకవైపు ధరలు పెరుగుదల ఇంకోవైపు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాల్ని నెట్టుకొస్తున్నారని, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు కూడా పెట్టలేని పరిస్థితుల్లో కార్మికులు ఉన్నారని అన్నారు. స్వచ్ఛభారత్ స్కీంలో భాగంగా మోడీ ప్రభుత్వం గతంలో జీతాలు ఇచ్చేదని, ఇప్పుడు 15వ ఫైనాన్స్ నుంచి సర్పంచులే జీతాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని కొంత మంది సర్పంచులు తమ దగ్గర ఆదాయం లేదని జీతాలు ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారన్నారు. సర్పంచుల మీద నెట్టివేయకుండా ప్రభుత్వమే గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు రాము, అప్పన్న, శ్రీను, సూర్యనారాయణ, రామారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లు స్థానిక ఎంపిడిఒ కే. రూపేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించకపోతే ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. చెత్త తీసుకువెళ్లే రిక్షాల మరమతుల ఖర్చులు గ్రీన్ అంబాసిడర్లు వద్ద వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం ఎంపిడిఒ రూపేష్ మాట్లాడుతూ తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, పారిశుధ్య కార్మికులు జి వెంకటరావు, సిహెచ్ అప్పారావు, బోర నాగమణి, బి అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లి: ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

బొండపల్లి: గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తొత్తడి పైడిపునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంతనంర ఇఒపిఆర్‌డి సుగుణాకరరావుకు వినతి పత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు నారాయణరావు, ఎస్.కృష్ణ, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

బిసి మహాసభ జయప్రదానికి సమావేశం

ప్రజాశక్తి - కొత్తవలస

ఈ నెల 7న విజయవాడలో జరగనున్న జయహో బిసి మహా సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాల య ఆవరణలో మండల ప్రజాప్రతి నిధులు, పార్టీ శ్రేణులు, నాయకు లు, కార్యకర్తలతో సోమవారం ఆయన సమావేశమ య్యారు. ఈ సందర్భ రాష్ట్రంలో బిసిలకు సముచిత స్తానాన్ని కల్పించామని గుర్తు చేశారు. వివిధ కార్పొరేషన్లు ఏర్పాటుచేసి పార్టీలో కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి పదవులను ఇచ్చామన్నారు. మండలంలోని దేశపాత్రునిపాలెం వద్దనున్న 3వేల కిలోమీటర్ల పైలాన్ నుంచి మంగళవారం ఉదయం సభకు బయలుదేతా మని అందరూ హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, సర్పంచులు మచ్చ ఎర్రయ్య రామస్వామి, విరోతి కొండలరావు, చింతల పైడినాయుడు, గేదెల మూర్తి, కృష్ణ, ఎంపిటిసి వెలగాల వెంకట రమణ, మండల పార్టీ అద్యక్షుడు ఒబ్బిన నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు మేలాస్త్రీ అప్పారావు, పల్లా భీష్మ, పాల్గొన్నారు.

గరివిడి: విజయవాడ కేంద్రంగా జరగనున్న బిసి మహసభను విజయవంతం చేయాలని వైసిపి మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు కోరారు. సోమవారం వారు మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ ఆ రోజు బిసి నాయకులంతా హాజరవ్వాలని చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పతివాడ రాజారావు, మండల నాయకులు రెల్లి అప్పలనాయుడు, రేవళ్ళ సత్తిబాబు, బైరెడ్డి లక్ష్మణరావు, గడే రామునాయుడు, గొర్రెల వెంకటరమణ, సిమ్మల అప్పన్న రాము పాల్గొన్నారు.

మానవ హక్కుల రక్షణకు ఉద్యమం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మానవ హక్కుల రక్షణకు ఉద్యమం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ పిలుపు నిచ్చారు. సోమవారం విజయనగరం సుందరయ్య కాలనీ లో. మానవ హక్కులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో రమణమ్మ మాట్లాడుతూ రోజూరోజుకు మానవ హక్కులు మృగ్య మైపోతున్నాయని, దళితులు,మహిళలపై రకరకాల రూపాల్లో దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని అన్నారు. యోగా ముసుగులో బాబాలు, ప్రవచనాల ముసుగులో మహిళల్ని మభ్యపెట్టాలని చూసిన వారిపై ఈ ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. హింసకు వ్యతరేకంగా మహిళలు ఉద్య మించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు సుజాత, సత్యవతి , పద్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్

బొబ్బిలి : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు ఆదివారం అర్ధరాత్రి సీజ్ చేశారు. బొబ్బిలి మండలం పిరిడి నుంచి చీపురుపల్లి లారీతో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అర్ధరాత్రి 2.30గంటల సమయంలో పిరిడి బస్‌స్టాప్ వద్ద విజిలెన్స్ ఎస్ఐ బి.రామారావు, కానిస్టేబుల్స్ జి.పురుషోత్తం, లక్ష్మీనారాయణ కలిసి దాడిచేసి పట్టుకుని సీజ్ చేశారు. లారీ డ్రైవర్ బోనెల సాంబయ్యను విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా తాను చిలకలపల్లి గ్రామానికి చెందిన బొడ్డు మోహనరావు వద్ద లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నానని, ధాన్యం కోసం పిరిడి రాగ ధాన్యం లేకపోవడంతో పిరిడిలో ఉన్న బియ్యాన్ని చీపురుపల్లి తీసుకువెళ్లాలని లారీ యజమాని మోహనరావు చెప్పడంతో బియ్యం లోడ్ చేసి చీపురుపల్లి తీసుకుని వెళు న్నట్లు డ్రైవర్ సాంబయ్య చెప్పారు. లారీలో 10 టన్నుల 100కిలోల బియ్యం ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారణ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రేషన్ బియ్యం పిరిడి గ్రామానికి చెందిన కొల్లి సూర్యారావు దగ్గర లోడ్ చేసినట్లు గుర్తించి సూర్యారావుపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు చెప్పారు.

విజిలెన్స్ అధికారులను పక్కదారి పట్టించిన వ్యాపారులు

విజిలెన్స్ అధికారులను బియ్యం వ్యాపారులు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ యజమాని బొడ్డు మోహనరావుకు పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం చిలకలపల్లిలో అయ్యప్ప మోడరన్ రైస్ మిల్లు ఉంది. రేషన్ బియ్యం వ్యాపారులు నుంచి రైస్ మిల్లు యజమాని కొనుగోలు చేసి బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేయడంతో చిలకలపల్లి తరలిస్తున్నట్లు చెప్పకుండా చీపురుపల్లి తరలిస్తున్నట్లు తప్పుడు సమాచారం ఇచ్చి విజిలెన్స్ అధికారులను పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని చిలకలపల్లిలో ఉన్న అయ్యప్ప మోడరన్ రైస్ మిల్లులో పాలిష్ చేసి ప్యాకింగ్ చేసి అధిక ధరలకు బియ్యాన్ని అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యం తరలింపుపై సమగ్ర దర్యాప్తు చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని పలువురు చర్చించుకుంటున్నారు. అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేసి రేషన్ బియ్యం తరలింపుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కళాశాలను సందర్శించిన కేసలి

శృంగవరపుకోట: మండలంలోని తాటిపూడి గురుకుల పాఠశాలను ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సోమవారం సందర్శించారు. ఈ పాఠశాలలో ఇటీవల విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహ సిబ్బంది విద్యార్థుల వసతి, డార్మేటరీ, భోజనాలు, వైద్య సదుపాయాలు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయం అన్ని అంశాలపైనా దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు సుధారాణి, పట్నాయక్ భవాని, జిల్లా బాలల న్యాయ మండలి సభ్యులు వావిలాపల్లి లక్ష్మణరావు, సిడిపిఒ ఎం.ఉమా, ప్రిన్సిపల్ శారదా బాయి, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి యాళ్ల నాగరాజు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27 కేసుల్లో ఘరానాదొంగ అరెస్టు

విజయనగరం : రాష్ట్రంలో 27 దొంగతనాలకు పాల్పడిన ఘరాన నేరస్థుడును అరెస్టు చేసినట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బలిజిపేట మండలం గంగాడ గ్రామానికి చెందిన మామిడి తిరుపతిరావు ప్రస్తుతం విశాఖలోని శ్రీహరిపురం నివాసం ఉంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై గతంలో 60 దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవించాడు.తరువాత మళ్లీ రాష్ట్రంలోని పలుచోట్ల చోరీలకు పాల్పడి నగదు, బంగారు ఆభరణాలు దోచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆయనను ప్రదీప్‌నగర్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఏడాది జూలై, ఆగస్టులో విజయనగరంలో 8నేరాలకు పాల్పడగా, అతని వద్ద నుండి 20 తులాల బంగారు ఆభరణాలు, తొమ్మిదిన్నర కిలోల వెండి వస్తువులను, రూ. లక్ష నగదు, స్కూటీ రికవరీ చేసినట్లు ఎస్‌పి తెలిపారు.